సాక్షి
చిత్తూరు
బుధవారం। 23 । ఆగస్టు । 2023



నీకోసం ఆశగా.. నీవైపే దీక్షగా

యావత్ దేశం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న చంద్రయాన్-3 మిషన్ ఆఖరి ఘట్టానికి చేరుకుంది. - IIలో



టీటీడీకి ద్విచక్రవాహనం వితరణ

తిరుమల శ్రీవారికి క్వాంటమ్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ ఎండీ శ్రీ.సి. చక్రవర్తి ఎలక్ట్రిక్ బైక్‌ను వితరణగా అందించారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	26
తిరుపతి	37	27
తిరుమల	31	21
గూడూరు	38	28
నగరి	37	27

న్యూస్‌రీల్

సీఎం పర్యటనకు పకడ్బందీ భద్రత



సూచనలిస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

నగరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు పకడ్బందీ భద్రత కల్పిస్తున్నట్లు ఎస్పీ రిషాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన నగరిలోని కీళపట్టు, డిగ్రీ కళాశాల మైదానాల్లో హెలీప్యాడ్ ఏర్పాటు చేసేందుకు స్థలాలను పరిశీలించారు. హెలీప్యాడ్ నుంచి ముఖ్యమంత్రి సభాస్థలికి చేరుకునే మార్గాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలను సమీక్షించారు. రోడ్‌షో నిర్వహించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ నెల 28వ తేదీన నగరిలో సీఎం పర్యటించనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ రవి కుమార్, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ సురేష్ పాల్గొన్నారు.

అవార్డులకు ఆన్‌లైన్ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జెడ్పీ, మండల, ఎయిడెడ్, పురపాలక, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని ఇంగ్లిష్ టీచర్లకు ఉత్తమ అవార్డులు ఇవ్వనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇంగ్లిష్ బోధిస్తున్న టీచర్లు అవార్డులు పొందేందుకు ఈ నెల 29వ తేదీన ఆన్‌లైన్ పరీక్ష రాయాల్సి ఉంటుందని వెల్లడించారు. ఆసక్తిగలవారు ఈ నెల 27 వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు www. centra.org/ events/ ap& centra& tq లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మూడో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కన్వీనర్ రవీంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 7 ప్రభుత్వ, 10 ప్రైవేట్ ఐటీఐలున్నట్లు చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27వ తేదీలోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 30న, ప్రైవేట్‌లో 31న కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. వివరాలకు 7799201479,7799933370 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


'ఉత్తమ ఉపాధ్యాయ' దరఖాస్తుకు గడువు పెంపు

చిత్తూరు కలెక్టరేట్ : ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల దరఖాస్తుకు గడువును ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలక, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పదేళ్లకు పైగా సర్వీసు ఉన్న టీచర్లు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎంఈఓ, డీవైఈఓల ద్వారా దరఖాస్తులను డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని వెల్లడించారు.

భవన నిర్మాణ పనులు వేగవంతం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా చేపట్టిన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు 73శాతం పూర్తి అయినట్లు చెప్పారు. ఆర్‌బీకేలు 73 శాతం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాల పనులు 56 శాతం పూర్తి అయినట్లు తెలిపారు. జిల్లాలో 40 వేల ఇళ్ల నిర్మాణాలకు గాను ఇప్పటి వరకు 39,621 పూర్తయ్యాయని, మిగిలినవి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమీక్షలో హౌసింగ్ పీడీ పద్మనాభం, పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా జీఈఆర్ సర్వే



కలెక్టర్ షణ్మోహన్


చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా జీఈఆర్ (స్థూల నమోదు నిష్పత్తి) సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఈ నెల 24వ తేదీ నాటికి వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వేను వేగవంతం చేయాలన్నారు. గుర్తించిన పిల్లలను బడిలో చేర్పించేలా ఎంఈఓలు చర్యలు చేపట్టాలని సూచించారు. 5 నుంచి 18 ఏళ్ల విద్యార్థుల డేటా ఎంఈఓల వద్ద ఉండాలని స్పష్టం చేశారు. సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీఈఓ మధుసూదన్ పాల్గొన్నారు.

మరణదండన



జిల్లా న్యాయస్థానం చారిత్రాత్మకమైన తీర్పునిచ్చింది.. జంట హత్యల కేసులో నిందితుడిని చనిపోయేవరకు ఉరితీయాలని ఆదేశించింది.. మానవత్వం లేని మృగానికి మరణదండనే సముచితమని స్పష్టం చేసింది.. ఉమ్మడి చిత్తూరు జిల్లా చరిత్రలో ఇది నాలుగో ఉరిశిక్షగా న్యాయవాదులు వెల్లడించారు.. పకడ్బందీగా సాక్ష్యాధారాలను సేకరించిన దర్యాప్తు అధికారిని ప్రశంసించారు. నేరం రుజువు చేయడంలో కీలక పాత్ర పోషించిన ప్రాసిక్యూషన్‌కు అభినందనలు తెలిపారు.

- 35 ఏళ్ల క్రితం 1988వ సంవత్సరం ఇరువురిని హత్య చేసిన కేసులో నిందితుడికి అప్పటి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఉరిశిక్ష విధించారు.
- 31 ఏళ్ల క్రితం 1992వ సంవత్సరం ఓ హత్య కేసులో ముద్దాయికి మరణశిక్ష పడింది.
- 2019 నవంబర్‌లో మదనపల్లెలోని అంగళ్లు వద్ద వర్షిత అనే అయిదేళ్ల చిన్నారిపై లైంగికదాడికి పాల్పడి, హత్య చేసిన కేసులో నిందితుడు మహ్మద్ రఫీకి ఉరిశిక్ష విధిస్తూ 2020 ఫిబ్రవరి 24వ తేదీన చిత్తూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి వెంకట హరినాథ్ తీర్పునిచ్చారు.



- తాజాగా జంట హత్యల కేసులో సయ్యద్ మౌలాలీకి ఉరిశిక్ష విధిస్తూ చిత్తూరులోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి రమేష్ తీర్పునివ్వడంతో.. చిత్తూరు న్యాయ చరిత్రలో ఇది నాలుగో మరణశిక్షగా రికార్డులకెక్కింది.

- జంట హత్యల కేసులో నిందితుడు మౌలాలీకి ఉరిశిక్ష
- ఉమ్మడి చిత్తూరు జిల్లా చరిత్రలో ఇది నాలుగోసారి
- రెండు జీవితఖైదులు.. జరిమానా
- చనిపోయేంత వరకు ఉరితీయాలని ఆదేశించిన న్యాయమూర్తి

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని జిల్లా న్యాయస్థానం మరోమారు వార్తల్లో నిలిచింది. జంట హత్యల కేసులో సయ్యద్ మౌలాలీ అనే ముద్దాయికి మంగళారం ఉరిశిక్ష విధించింది. నిందితుడికి మరణశిక్ష పడటంలో ఈ కేసు దర్యాప్తు అధికారి, నాటి మదనపల్లె డీఎస్పీ రవిమనోహరాచారి సేకరించిన సాక్ష్యాలు కీలకంగా మారినట్లు న్యాయవాద వర్గాలు తెలిపాయి. చిత్తూరు కోర్టు చరిత్రలో నాలుగోసారి ఉరిశిక్ష విధించారని వెల్లడించాయి.

సోమవారమే నిరూపణ..

సరళమ్మ, గంగులమ్మ జంట హత్యల కేసులో సోమవారమే నిందితుడు సయ్యద్ మౌలాలీపై నేరం రుజువైంది. నిందితుడిని కోర్టులోకి పిలిచిన న్యాయమూర్తి రమేష్.. '' నీపై నేరం రుజువైంది. నీవు చెప్పుకునేది ఏమైనా ఉందా..?'' అని ప్రశ్నించారు. '' అయ్యా, ఇంతకుముందు లైంగికదాడి కేసులో నాకు లైఫ్ (జీవితఖైదు) వేసినారు. ఈ నేరానికి కూడా అదే శిక్ష వేయండి..'' అని విన్నవించాడు. దీంతో న్యాయమూర్తి తీర్పును మంగళవారానికి రిజర్వు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

లైఫ్ వేయండి..!

మంగళవారం కోర్టుకు వచ్చిన మౌలాలీ తీర్పు వెలువడక ముందు ఎలాంటి బెరుకు, భయం లేకుండా తనకు భద్రతగా వచ్చిన పోలీసులతో మాట్లాడుతూ మామూలుగానే కనిపించాడు. మధ్యాహ్నం భోజన విరామానికి ముందు కోర్టులోకి నిందితుడి పిలిపించిన న్యాయమూర్తి మరోమారు ''నీపై నేరం నిరూపణైంది. నీవు చెప్పుకునేది ఏమైనా ఉందా..?'' అని ప్రశ్నించారు. దీనికి మౌలాలీ సమాధానమిస్తూ '' అయ్యా.. నా తల్లిదండ్రులు సచ్చిపోయినారు. నాకు భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉండారు. నాకు జీవిత ఖైదు మాత్రమే వేయండి..'' అని మరోమారు విన్నవించుకున్నాడు. తీరా మరణశిక్ష విధిస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పు చెప్పడంతో మౌలాలీ ముఖంలో ఒకింత ఆందోళన కనిపించింది. అనంతరం అతడిని పోలీసులు జైలుకు తరలించారు.



చిత్తూరులోని జిల్లా న్యాయస్థానాల సముదాయం



కోర్టు హాల్ వద్ద నిందితుడు సయ్యద్ మౌలాలీ

పక్కాగా సాక్ష్యాధారాలు



మహిళలు, పిల్లలపై జరుగుతున్న నేరాలను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నేరస్తులకు కఠిన శిక్ష పడేందుకు మహిళా కోర్టును ఏర్పాటు చేసింది. ఇలాంటి కేసుల్లో ముద్దాయికి గరిష్టంగా ఉరిశిక్ష విధించాలని కోర్టులో వాదించేందుకు ఉన్నత న్యాయస్థానాల తీర్పులు, సాక్ష్యాధారాలను సుదీర్ఘంగా అధ్యయనం చేయాల్సి వచ్చింది. దర్యాప్తు అధికారి రవిమనోహరచారి సేకరించిన సాక్ష్యాలు, ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టులు, మృతురాలి కుమార్తె ఇచ్చిన వాంగ్మూలం నేర నిరూపణలో బాగా ఉపయోగపడ్డాయి.

– వి.లోకనాథరెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, చిత్తూరు

నేరానికి శిక్ష తప్పదు



నేరం చేసిన వ్యక్తి తప్పించుకోవచ్చనే భావనతో ఉంటాడు. ఎలాంటి వారైనా సరే చేసిన నేరం చేస్తే పోలీసులకు చిక్కాల్సిందే. ముద్దాయికి శిక్ష పడటంలో సాక్ష్యాల సేకరణ, ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టులు, దర్యాప్తు అధికారి నిబద్ధత కీలకంగా మారుతుంది. సరళమ్మ, గంగులమ్మను చంపిన మౌలాలీ వారి మృతదేహాలు కూడా దొరకకూడదని పథకం పన్నాడు. కానీ, చివరకు చేసిన నేరం బయటపడక తప్పలేదు. ఉరిశిక్ష పడింది.

– వై.రిషాంత్‌రెడ్డి, ఎస్పీ, చిత్తూరు

ముగిసిన త్యాగరాజ సంగీతోత్సవాలు



వీణా వాయిద్య సంగీత కచేరీ చేస్తున్న నిత్యశ్రీ బృందం

తిరుపతి కల్చరల్: శ్రీత్యాగరాజ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో త్యాగరాజ మండపంలో ఈనెల 18 నుంచి ప్రారంభమైన శ్రీత్యాగరాజ సంగీతోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఐదు రోజుల పాటు సాగిన ఈ సంగీతోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి 13 మంది ప్రముఖ సంగీత, వాయిద్య సంగీత విద్వాంసులు పాల్గొన్నారు. సప్తగిరి సంగీత విద్వన్మణి బిరుదును ప్రముఖ సంగీత విద్వాంసురాలు డాక్టర్ పంతుల రమకు బహూకరించి ఘనంగా సత్కరించారు. చివరి రోజైన మంగళవారం సాయంత్రం ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థుల వాయిద్య సంగీత కచేరి అలరింపజేసింది. అనంతరం ప్రముఖ కళాకారిణి డాక్టర్ ఎస్.నిత్యశ్రీ వీణ వాయిద్య సంగీతం సభికులను రంజింపజేసింది. తర్వాత కున్నకుడి ఎం.బాలమురళీకృష్ణ ప్రదర్శించిన సంగీత కచ్చేరి ఆకట్టుకుంది. సంగీత విద్వాంసుల బృందాలను శ్రీత్యాగరాజ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మోహన్ సుందరం, కంచి రఘురామ్, ఎస్.ప్రభాకర్, ఎస్.శ్రీనివాసులు, ఏ.భానుమూర్తి, ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఘనంగా సత్కరించి అభినందించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. సోమవారం అర్ధరాత్రి వరకు 69,909 మంది స్వామివారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టిక్కెట్లు ఉంటే సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

భీ'కరి' బాధితులకు భరోసా



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి : ఏనుగులు, ఇతర వన్యప్రాణుల దాడిలో బాధితులకు అండగా ఉంటామని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ భరోసా ఇచ్చారు. పంట, ప్రాణ నష్టం వాటిల్లిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముందుంటారని తెలిపారు. శనివారం మండలంలోని పెద్దకాప్పల్లె పంచాయతీ ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మార్కొండయ్య ఒంటరి ఏనుగు దాడిలో మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఎంపీ, ఎమ్మెల్యే మంగళవారం పరామర్శించారు. పరిహారంగా రూ.5లక్షల చెక్కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కౌండిన్య అటవీ పరిధిలో ఏనుగుల దాడులు వలన రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వన్య ప్రాణుల బారిన పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ పనులకు సైతం సహచరులతో కలిసి గుంపులుగా వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, ఆంజమ్మ, ఎఫ్ఆర్‌ఓ బాలకృష్టా రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, మాకయ్య, సర్పంచ్ చంద్రమోహన్, వైస్ సర్పంచ్ అంజిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పావని, లాయర్ భాస్కర్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు సురేంద్ర, రమణారెడ్డి పాల్గొన్నారు.

గజ బీభత్సం

మండలంలోని పెద్దకాప్పల్లె పంచాయతీ కొత్తబూరగపల్లెలో పంట పొలాల్లో సోమవారం రాత్రి సుమారు 11 ఏనుగులు విధ్వంస సృష్టించాయి. గ్రామానికి చెందిన మునివెంకటరెడ్డి మామిడి తోటకు వేసిన ఫెన్సింగ్‌ను నేలమట్టం చేశాయి. తిప్పిరెడ్డిపల్లెకు చెందిన బాబు రెడ్డి, నరేంద్రరెడ్డి, సాగుచేసిన రెండెకరాల రాగి పంటను తొక్కి నాశనం చేశాయి. అమరారెడ్డి, మార్కొండారెడ్డి సాగు చేసిన పచ్చిగడ్డి, మొక్కజొన్న పంటలను పూర్తిగా తినేశాయి. అరటి చెట్లను విరిచేశాయి. దీనిపై సమాచారం అందుకున్న రాయలపేట, చారాల ఫారెస్టు బీట్ అధికారులు రవికుమార్, దొరస్వామి మంగళవారం ఏనుగులు దాడిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పరిహారం అందించేందుకు నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ద్రౌపదమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి రోజా, సెల్వమణి దంపతులు

పుత్తూరు రూరల్ : పట్టణంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామివారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి ఆర్‌కే రోజా, సెల్వమణి దంపతులు మంగళవారం పట్టువస్త్రాలు, మంగళసూత్రం సమర్పించారు. ముందుగా బజారు వీధిలోని సెల్వ వినాయకస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల సందడి నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు. మంత్రి దంపతులకు ఆలయం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం రోజా,సెల్వమణి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. మంత్రి రోజా మాట్లాడుతూ గత 9 ఏళ్లుగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్నామని తెలిపారు. మంత్రి హోదాలో రెండేళ్లుగా సారె సమర్పించడం అమ్మ ఆశీర్వాదంతోనే జరిగిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే పురపాలక సంఘం తరఫున కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి పట్టువస్త్రాలను మంత్రితో కలిసి సమర్పించారు. అంతకు ముందు ఉదయం 6 గంటలకు గెరగ ఊరేగింపు, పల్లకి సేవ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. అమ్మవారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి 9 గంటలకు స్వామి అమ్మవార్లు అశ్వవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్, మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు ఏకాంబరం, పవన్‌కుమార్, బాలాజీ, భువనేశ్వరి, కె.రాధా, రాజేశ్వరి, బి.రాధ, హేమలత, కో–ఆప్షన్ మెంబర్ షకీలా పాల్గొన్నారు.

ఆప్యాయతే అన్నకు రిటర్న్ గిఫ్ట్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రోజా

నగరి : సంక్షేమ పాలన అందిస్తూ.. పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు ఆప్యాయతనే రిటర్న్ గిఫ్ట్‌గా అందించాలని మంత్రి ఆర్‌కే రోజా కోరారు. మంగళవారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెన పథకం రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయంటే అది ముఖ్యమంత్రి జగనన్న చలువతోనే అని వెల్లడించారు. ప్రతి ఇంటికీ సొంత కుమారుడిలా.. మేనమామలా.. సోదరుడిలా..మనవడిలా అండగా ఉంటున్నారని వివరించారు. సీఎం సభకు హాజరయ్యే అవకాశాన్ని అత్యధిక సంఖ్యలో ప్రజలకు కల్పించాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని తెలిపారు. నగరి నియోజకవర్గ ప్రజల స్వాగతం ఎలా ఎంటుందో రాష్ట్రానికి చూపించాలని కోరారు. సమావేశంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి, మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నంరెడ్డి, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లీ, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, పార్టీ మండల కన్వీనర్ సుదర్శననాయుడు తదితరులు పాల్గొన్నారు.

'కంచర్ల'.. సవాల్‌కి కట్టుబడు



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: కుప్పంలో టీడీపీ ఓడిపోతే నియోజకవర్గాన్ని వదిలి వెళ్లిపోతానని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చేసిన సవాల్‌కు కట్టుబడాలని ఎమ్మెల్సీ భరత్ కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పంచాయతీ వార్డు సభ్యుల ఎన్నికల్లో టీడీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ కుప్పం వదిలి వెళ్తావా శ్రీకాంత్ ? అని ప్రశ్నించారు. కుప్పం నియోజక వర్గంలో వైఎస్సార్ సీపీ దొంగ ఓట్లు చేరిపించిందని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం హాస్యాస్పదమన్నారు. ఉన్సిగానిపల్లె పంచాయతీ 94వ బూత్‌లో 46 దొంగ ఓట్లు ఉన్నట్లు అవాస్తవాలను ప్రచారం చేశారని ఆరోపించారు. 26 మంది వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు మరణించినట్లు అసత్యాలు వల్లించారని మండిపడ్డారు. టీడీపీ వారు ప్రకటించిన 26 మంది ఆధార్ కార్డులు, చిరునామాల వివరాను విలేకర్లకు అందజేశారు. కుప్పంలో నకిలీ ఓటర్లను ఏరివేసేందుకు వైఎస్సార్‌సీపీ కృషి చేస్తోందని స్పష్టం చేశారు. వరుస ఓటములు జీర్ణించుకోలేకే టీడీపీ నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో–కన్వీనర్ చంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, రెస్కో డైరెక్టర్లు నాగిరెడ్డి, రవినాయక్ పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు రూ. 6లక్షల 'సహాయం'



అర్షిత తండ్రి శివకుమార్‌కు చెక్కు అందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి అర్షిత చికిత్సకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం అందజేశారు. యాదమరి మండలం కీనాటం పల్లెకు చెందిన శివకుమార్, ఝాన్సీ దంపతుల కుమార్తె అర్షిత (2)కు ట్రేచల్ స్టెనోసిస్ అనే అరుదైన వ్యాధి వచ్చింది. సహాయం చేయాలని చిన్నారి తల్లిదండ్రులు ఈ నెల 4వ తేదీన జిల్లా విచ్చేన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి రూ.6లక్షలు మంజూరు చేశారు. జగనన్న మేలును జన్మలో మరువలేమని అర్షత తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అన్నమాచార్య సాహిత్యం.. యువత చైతన్యం



మాట్లాడుతున్న అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకుడు విభీషణ శర్మ


గూడూరు రూరల్: యువతను చైతన్య పరుస్తూ పదకవితా పితామహుడు అన్నమాచార్య అనేక కవితలు, పద్యాలు రచించారని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు ఆకెళ్ల విభీషణశర్మ అన్నారు. గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో టీటీడీ, డీఆర్‌డబ్ల్యూ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం తాళ్లపాక అన్నమాచార్య జాతీయ సాహితీ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విభీషణశర్మ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతను చైతన్యపరుస్తూ అన్నమాచార్య అనేక సాహిత్యాలు, పద్యాలు రచించారన్నారు. కార్యక్రమంలో ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు, డాక్టర్ కే.మెహర్మణి, విద్యాసాగర్, హనుమంతరావు, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

టీటీడీకి ద్విచక్ర వాహనం వితరణ

తిరుమల: తిరుమల శ్రీవారికి మంగళవారం క్వాంటమ్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ ఎండీ శ్రీ సీ.చక్రవర్తి విద్యుత్ ద్విచక్ర వాహనాన్ని విరాళంగా అందించారు. ఈ వాహనం ధర రూ.1,18,276 అని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ముందుగా ఆలయం వద్ద ఈ వాహనానికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనం తాళాలను తిరుమల డీఐ జానకీరామ్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ బోర్డు సభ్యులు శ్రీభానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

'నీకోసమే పరితపించాను. నినుసేవించాలని ఎన్నో ఏళ్లుగా నిరీక్షించాను. కోట్లాది మంది ఆశలు మోసుకొచ్చాను. నీ గుండెలపై ఆడుకోవాలని.. నీలో దాగి ఉన్న సుగుణాలను ప్రపంచానికి తెలియజేయాలని సంకల్పించాను. ఒక్క అడుగుతో మొదలైన నా ప్రయాణం.. వేల అడుగులు.. లక్షల కిలోమీటర్లు దాటివచ్చాను. నీ వెలుగు కోసం చీకట్లు చీల్చుకుంటూ తరలివచ్చాను. నీ చెంతనే తిరుగుతూ.. నీ అందాలను వీక్షిస్తూ.. నీ పరిమళాలను ఆశీర్వదిస్తూ ఆనందిస్తున్నాను. నన్ను ఆశీర్వదించు.. నా నిరీక్షణకు తెరదించు.. నన్ను నమ్ముకున్న ప్రజల ఆకాంక్షను నెరవేర్చు' అన్నట్టు చంద్రయాన్–3 రాకెట్ ప్రయాణం దిగ్విజయంగా కొనసాగుతోంది. అన్నీ అనుకూలిస్తే బుధవారం సాయంత్రం చంద్రుడి ఉపరితలం దక్షిణధృవంలో చంద్రయాన్–3 మిషన్‌లో భాగమైన ల్యాండర్ మాడ్యూల్‌ను 6.04 గంటలకు సురక్షితంగా దించేందుకు ఇస్రో సర్వం సిద్ధం చేసింది.

నీ కోసం ఆశగా.. నీవైపే దీక్షగా!




- చంద్రయాన్–3 సేఫ్ ల్యాండింగ్ నేడే
- ఉత్కంఠగా ఎదురు చూస్తున్న జనం
- గత ప్రయోగాలను నెమరు వేసుకుంటున్న వైనం



సూళ్లూరుపేట: చల్లని వెన్నెల కురిపించే చంద్రుడిపై పరిశోధనల కోసం పంపిన చంద్రయాన్–3 ప్రయోగం ఆఖరి ఘట్టానికి చేరింది. ఈ ప్రయోగానికి సంబంధించి బుధవారం సాయంత్రం 5.27 గంటలకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. మునివేళ్లపై నిలబడి ఉత్కంఠ రేపుతున్న ఈ ప్రయోగం విజయవంతం కావాలని యావత్ భారత లోకం కోరుతోంది. తండ్రి తర్వాత తండ్రిలాంటి మామ.. చల్లని మనసుతో ఆశీర్వదించాలని, ఆకాంక్షను నెరవేర్చాలని ముక్తకంఠంతో కోరుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు చంద్రుడిపైకి పంపిన చంద్రయాన్ ప్రయోగాలను ఓ సారి నెమరువేసుకుందాం.

చంద్రయాన్–1 ప్రయోగం సక్సెస్

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు మొట్టమొదటిగా 2008లో చంద్రయాన్–1 పేరుతో ఒక ప్రయోగాన్ని చేపట్టారు. ఈ ప్రయోగానికి రూ.380 కోట్లు ఖర్చుచేశారు. చంద్రుడి ఉపరితలం మీదకు కాకుండా చంద్రుడి కక్ష్యలోకి (లూనార్ ఆర్బిట్) ఉపగ్రహాన్ని పంపించి చంద్రుడి చుట్టూరా పరిభ్రమించేలా చేశారు. చంద్రుడిపై ల్యాండర్‌ను దించేందుకు ఈ ప్రయోగం ద్వారా తెలుసుకోవాలని చేసిన ప్రయత్నాలు ఫలించాయనే చెప్పాలి. ఈ ప్రయోగంలో చంద్రుడికి రెండో వైపు దక్షిణ ధృవంపై కూడా పరిభ్రమించేలా చేసి చంద్రుడిపై నీళ్లు ఉన్నాయని, పెద్ద పెద్ద బిలాలు ఉన్నాయని కనుగొన్నారు.



2008లో ప్రయోగించిన చంద్రయాన్-1 ఉపగ్రహం

చంద్రయాన్–2 ప్రయోగం పాక్షిక విజయం!



చంద్రయాన్-2 మిషన్‌లో ఆర్బిటర్‌తో అనుసంధానంగా ల్యాండర్ మాడ్యూల్

ఈ సారి చంద్రుడిపై ల్యాండర్‌ను దించి అందులో అమర్చిన రోవర్ ద్వారా చంద్రునిపై మూలాలను అధ్యయనం చేయడానికి చంద్రయాన్–2 ప్రయోగానికి 2019 జులై 15న శ్రీకారం చుట్టారు. దీనికోసం రూ.508 కోట్లు ఖర్చుచేశారు. ఈ ప్రయోగం ద్వారా చంద్రుడి మూలాలను పరిశోధనలు చేయడానికి ప్రయత్నాలు చేశారు. 62 రోజుల పాటు పనిచేసి చంద్రయాన్–2 మిషన్ చంద్రుడికి చేరువగా తీసుకెళ్లారు. ప్రయోగం సక్సెస్ అయిందనుకున్న తరుణంలో ఆఖరు రెండు నిమిషాల్లో ల్యాండర్ చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొని సిగ్నల్స్ కట్ అయ్యాయి. అయితే ల్యాండర్ వదిలిపెట్టిన ఆర్బిటర్ ఉపగ్రహం ఇప్పటికీ పనిచేస్తూ చంద్రుడిపై సమాచారాన్ని అందిస్తూనే ఉంది.

చంద్రయాన్–3 భవితవ్యం తేలేది నేడే



చంద్రయాన్-3 మిషన్‌లో భాగంగా చంద్రుడిపై ఈ విధంగా సురక్షితంగా దిగనున్న ల్యాండర్ మాడ్యూల్

గత వైఫల్యాలను చక్కదిద్దుకుంటూ ఈ సారి చంద్రయాన్–3 ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. శ్రీహరికోట రాకెట్ అంతరీక్ష కేంద్రం నుంచి జూలైన ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్–3 మిషన్‌ను ప్రయోగించారు. 43 రోజుల తరువాత బుధవారం చంద్రుడి ఉపరితలంపై దించేందుకు సంకల్పించారు. ఈ సారి ఆరు పేలోడ్స్‌తో చంద్రయాన్–3ని రూపకల్పన చేశారు. ప్రపొల్షన్ మాడ్యూల్‌లో రెండు, ల్యాండర్‌లో నాలుగు, రోవర్‌లో రెండు, అమెరికాకు చెందిన ఒక పేలోడ్‌ను అమర్చారు. ఈ ప్రయోగంలో 42 రోజుల పాటు చంద్రయాన్–3 మిషన్‌ను భూస్థిర కక్ష్యతోపాటు చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. అన్నీ అనుకూలిస్తే బుధవారం సాయంత్రం చంద్రుడిపై సేఫ్ ల్యాండ్ చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. ల్యాండర్ ల్యాండింగ్ అయితే ప్రపంచంలోనే చంద్రుడి దక్షిణ ధృవ ప్రాంతంలో ల్యాండర్‌ను దించిన మొట్టమొదటి దేశంగా భారత్ ఆవిర్భవించనుంది.



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,000
రిటైల్ వెండి గ్రాము	రూ.74.00

మద్యం మత్తులో నాల్గో అంతస్తు నుంచి దూకేశాడు



మృతి చెందిన కార్మికుడు గంగ

తిరుపతి రూరల్: పగలంతా కాయకష్టం చేశారు. సాయంత్రం దాకా శ్రమించారు. రాత్రికి ఫుల్‌గా మందు కొట్టారు. తాగిన మత్తులో ఎలాంటి భద్రత లేని నిర్మాణంలో ఉన్న భవనంలో నిద్రించారు. నిద్ర మత్తులో భవనం పైనుంచి పడి శాశ్వతంగా కన్నుమూసి కన్నవారికి తీరని దుఃఖాన్ని మిగిల్చిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. తిరుపతి రూరల్ ఎస్‌ఐ పూర్యానాయక్ కథనం.. తిరుపతి రూరల్ మండలం, అవిలాల పంచాయతీ పరిధిలో బెంగళూరుకు చెందిన పారిశ్రామికవేత్త భారీ షాపింగ్ మాల్‌ను నిర్మిస్తున్నాడు. ఒడిశాకు చెందిన గంగా(24) మరి కొందరు కార్మికులు సెంట్రింగ్ పనులు చేస్తున్నారు. నిర్మాణంలో ఉన్న షాపింగ్‌మాల్ భవనం నాలుగో అంతస్తులో కార్మికులు నిద్రిస్తున్నారు. మద్యం మత్తులో ఉన్న గంగా సోమవారం అర్ధరాత్రి 11.40 గంటల సమయంలో నాలుగో అంతస్తు నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో తిరుపతి రూరల్ ఎస్‌ఐ పూర్యనాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ పూర్యానాయక్ తెలిపారు.

ప్రతి ఇంటికీ ఉద్యోగమే లక్ష్యం

రాపూరు: వెంకటగిరి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ ఉద్యోగ అవకాశం కల్పించడమే లక్ష్యమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాపూరు తెలుగుగంగ అతిథి గృహంలో రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల నాయకులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబర్ 8 వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవన్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 40 కంపెనీలు పాల్గొంటాయని, అందులో 10వ తరగతి నుంచి డిగ్రీ, బీటెక్, ఎంటెక్ వరకు చదివిన నిరోగ్యగ యువతీయకులు జాబ్ మేళలో పాల్గొనవచ్చన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయనరెడ్డి, జెడ్పీ ఉపాధ్యక్షురాలు ప్రసన్న, ఎంపీపీ ప్రసన్న, మాజీ సొసైటీ అధ్యక్షుడు చెన్ను భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

బిడ్డను వదిలివెళ్లిన ఘటనపై ఫిర్యాదు

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి బాత్‌రూంలో ఓ తల్లి ప్రసవించి బిడ్డను వదిలివెళ్లిన ఘటనపై సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 16 తేదీ వేకువజామున పురిటినొప్పులతో వచ్చిన ఆ తల్లి బాత్‌రూంలో ప్రసవించింది. తర్వాత అక్కడే బిడ్డను వదిలి సహాయకులతో పరారైంది. ఆపై బిడ్డను గుర్తించిన ఆస్పత్రి సిబ్బంది ఎస్‌ఎన్‌సీ వైద్యులకు అప్పగించారు. ఏడు రోజులుగా పసికందు అక్కడే చికిత్స పొందుతోంది. మరో నెల పాటు చికిత్స అవసరమని వైద్యులు చెబుతున్నారు. ఈ ఘటనపై సాక్షి పత్రికలో వరుస కథనాలు ప్రచురితమవుతున్నాయి. దీనిపై స్పందించిన ఏపీ వీపీ కమిషన్ వెంకటేశ్వర్లు, కలెక్టర్ షణ్మోహన్ విచారణకు ఆదేశించారు. డీఐఓ రవిరాజు మూడున్నర గంటలపాటు ఆస్పత్రిలో విచారణ చేశారు.సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఆ తల్లి ఎలా వచ్చింది...? ఎవరితో వచ్చింది..?ఎలా వెళ్లింది..? ఎవరైనా ప్రసవ సమయంలో సహకరించారా..? అనే విషయాలపై పూర్తి స్థాయిలో ఆరా తీశారు. నివేదికలు తయారు చేసి కలెక్టర్‌కు అందించారు. పసికందుకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఆస్పత్రి అధికారులు సైతం మరో అడుగు ముందుకు వేశారు. ఈ మేరకు సోమవారం సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ రాత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలని కోరారు.

వృద్ధురాలిపై దాడి

సోమల: పంచాయతీ పరిధిలోని చిన్న సోమలలో ఓ వృద్ధురాలిపై సోమవారం రాత్రి కొందరు యువకులు దాడి చేశారు. వివరాలు.. కిరాణా దుకాణం నిర్వహిస్తున్న అంజమ్మ(58) సిగరెట్లు అప్పుగా ఇవ్వలేదని ఆగ్రహించిన యువకులు దాడికి దిగారు దీతో అంజమ్మ చేయి విరిగిపోయంది. బాధితురాలు పుంగనూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తులతో వీరంగం

–ఐదుగురు బైండోవర్



ఆటోలోంచి కత్తులు చూపుతున్న వ్యక్తులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో కొందరు కత్తులతో రోడ్డుపై రాపాడిస్తూ వెళ్లడంపై పోలీసులు కన్నెర్ర చేశారు. సోమవారం స్థానిక పాత బస్టాండు నుంచి ఇరువారం వరకు ఓ ఆటోలో వెళుతున్న వ్యక్తులు కత్తులను తీసి రోడ్డుమీద రాస్తూ వెళ్లారు. ఆ శబ్దాలకు వాహన చోదకులు హడలిపోయారు. కొందరు దీనిని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది. విషయం ఎస్పీ రిషాంత్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో నిందితులను గుర్తించాలని డీఎస్పీ శ్రీనివాసమూర్తిని ఆదేశించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులు పెద్ద హరిజనవాడ, ఇరువారం, వైఎస్సార్ కాలనీకి చెందిన మదన్, సెల్వం అలియాస్ జబోటు, కుమార్ అలియాస్ కుల్ల, అబ్దుల్ రవూఫ్, మణిగా గుర్తించారు. మంగళవారం అదుపులోకి తీసుకున్న సీఐ మద్దయ్య ఆచారి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఒక్కో నిందితుడి నుంచి రూ.3 లక్షల సొంత పూచీకత్తు తీసుకున్న తరువాత విడుదల చేశారు.

సుదీర్ఘ ప్రయాణం.. ఆపై కునుకు!



రక్తగాయాలతో బాధితులు

తిరుపతి రూరల్: ఎనిమిది వందల కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం.. బంధువుల ఇంట శుభకార్యం .. కారులో వెళ్లి ఆనందంగా తిరుగుప్రయాణం.. అందరూ హాయిగా నిద్రిస్తున్న సమయం.. మరో ఐదు నిమిషాల్లో గమ్యానికి చెరుకుంటామన్న ధైర్యం.. ఇంతలో అనుకోని ప్రమాదం.. రెండు రోజులుగా విశ్రాంతి లేని డ్రైవింగ్‌తో డ్రైవర్ కునుకు తీశాడు. దీంతో వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పింది. జాతీయ రహదారిపై నుంచి పక్కనే ఉన్న చెరువులోకి ఫల్టీలు కొడుతూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. తమిళనాడు రాష్ట్రం తంజావురుకు చెందిన సునీల చాలా ఏళ్ల క్రితమే తిరుపతి జిల్లా రేణిగుంటకు వలస వచ్చి స్థిరపడ్డారు. సొంత ఊరు తంజావురులో బంధువుల ఇంట్లో శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి కారులో ఆదివారం బయలుదేరి వెళ్లారు. కార్యక్రమం ముగించుకుని సోమవారం రాత్రి తిరుగుప్రయాణమయ్యారు. సుదీర్ఘ ప్రయాణం కావడం.. డ్రైవర్ కునుకు తీశాడు. మరో ఐదు నిమిషాలకు రేణిగుంటకు చేరుకుంటామనగా మంగళవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిపై అవిలాల చెరువుకు సమీపంలో కారు అదుపు తప్పింది. దాదాపు 100 మీటర్లు రోడ్డును క్రాస్ చేసి చెరువులోకి దూసుకెళ్లింది. రెండు సార్లు ఫల్టీలు కొట్టింది. కారులో ఉన్న సునీల, సెల్వీ, భవానీ, ఓ చిన్నారికి గాయాలయ్యాయి. తలకిందులుగా పడి ఉన్న కారులో నుంచి గాయాలతో ఉన్న బాధితులు సాయం కోసం ఆర్తనాదాలు చేశారు. అదే సమయంలో అవిలాల చెరువులో వాకింగ్ చేస్తున్న పాదాచారులు ప్రమాదాన్ని గుర్తించి అక్కడికి చేరుకున్నారు. తలకిందులుగా ఉన్న కారును మాములు స్థితికి చేర్చారు. బాధితులను క్షేమంగా బయటకు తీశారు. అనంతరం గాయపడిన వారిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తిరుపతి రూరల్ ఎస్‌ఐ పూర్యనాయక్ తెలిపారు. సహాయక చర్యల్లో వేగంగా స్పందించిన రేణిగుంట కానిస్టేబుల్ రాజశేఖర్, తిరుపతి రూరల్ రక్షక్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

విశ్రాంతి తీసుకోండి

సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు కొన్ని నిబంధనలను తప్పకుండా పాటించాలి. ప్రయాణ సమయంలో సీటు బెల్టు పెట్టుకోవాలి. ప్రమాదకర మలుపుల వద్ద నెమ్మదిగా వెళ్లాలి. కునుకు వస్తే వాహనాన్ని పక్కన ఆపి ముఖాన్ని కడుక్కోవడం గానీ, రిఫ్రెష్ కావడం కానీ చేయాలి.

– పరమేశ్వరరెడ్డి, తిరుపతి ఎస్పీ

ఉమ్మడి జిల్లాలో అమ్మాయిల అదృశ్యం

చిత్తూరు అర్బన్: రెండు రోజుల వ్యవధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదుగురు అమ్మాయిలు అదృశ్యమయ్యారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆయా స్థానిక పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. చిత్తూరు మండలంలో గీత, కల్లూరులో నసీబ, తిరుపతి జిల్లా గూడురులో భువనేశ్వరి, తిరుపతిలో దీపిక అదృశ్యమైనట్లు కేసులు నమోదయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వార్డు సభ్యుడు



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి పంచాయతీ వార్డు సభ్యుడు

వాకాడు: మండలంలోని రావిగుంటపాళెం పంచాయతీకి చెందిన టీడీపీ సానుభూతి వార్డు మెంబర్‌తోపాటు మరో టీడీపీ నాయకుడు మంగళవారం గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దువ్వూరు అజిత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 6వ వార్డులో టీడీపీ బలపరిచిన వార్డు మెంబర్ ఇలప తిరిపాలయ్య, అలాగే టీడీపీ నాయకుడు ఇంగిలాల చిట్టి టీడీపీని వదిలి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. దామోదర్‌రెడ్డి, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్ట్

పుంగనూరు: అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ సీతారామిరెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. పెద్దపంజాణి మండలం శెట్టివారిపల్లె క్రాస్ వద్ద అక్రమ మద్యం రవాణా చేస్తున్నారనే సమాచారంతో దాడులు చేశారు. మనోజ్, లక్ష్మణ్, హరీష్‌ను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.40 వేల విలువ చేసే 960 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు పృథ్వీరాజ్, అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తమిళనాడు బియ్యం పట్టివేత



బియ్యంలోడ్‌తో పట్టుబడిన వాహనం

వి.కోట: కర్ణాటకకు తరలిస్తున్న తమిళనాడు రేషన్ బియ్యాన్ని మంగళవారం సీజ్ చేశారు. వివరాలు.. వి.కోట–పెర్నంబట్ రోడ్డు సమీపంలోని నాయకనేరి అటవీ ప్రాంతం వద్ద టెంపోలో దాచిన 90 రేషన్ బియ్యం బస్తాను తమిళనాడు ఫుడ్ సెల్ అధికారులు, సీఐ ఆశీర్వాదం, తహసీల్దార్ చిట్టిబాబు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ పరారైనట్లు పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాజా (ఫైల్)

కల్లూరు(పులిచెర్ల): మండలంలోని జ్యోతినగర్ జెండామాను వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. ఊడగవారిపల్లెకు చెందిన రాజా(34) ద్విచక్ర వాహనంలో పీలేరుకు వెళుతుండగా మార్గం మధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. క్షతగాత్రుడిని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ విశ్వనాథ్ తెలిపారు.